# కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మడం లేదు

- అభ్యర్థులు లేక ఇతర పార్టీల నుంచి తెచ్చుకుంటున్నారు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు వరం
- పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, అక్టోబర్ 20: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇస్తున్న హామీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పేర్కొన్నారు. స్థానిక 37వ డివిజన్ లోని మీ కోసం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో జరిగిన అభివృద్ధిని చూడగానే రాహుల్‌గాంధీకి ఏం మాట్లాడాలో అర్థం కాకుండా పోయిందన్నారు. జాతీయ పార్టీ లీడర్ వస్తే కూడా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ పెట్టుకునే స్థితికి కాంగ్రెస్ దిగజారిందన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదంటేనే వారి ఓటమిని ఒప్పుకున్నట్లేనని విమర్శించారు. పోటీ చేసేందుకు కాంగ్రెస్ నాయకులు లేక ఇతర పార్టీల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 55 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు చెబుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇవన్ని కాంగ్రెస్ అమలు చేసి ఉంటే ఇప్పటికే ప్రపంచంలో భారతదేశం అగ్రాగమిగా నిలిచేదన్నారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలు, ఓబీసీ, దళితులు గుర్తుకు వస్తారన్నారు. ఇన్నేళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వారి అభ్యున్నతి కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్లు పోరాటం చేసి కేంద్రం మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. మొదట తెలంగాణ ఇస్తున్నామని సోనియాగాంధీ ప్రకటించి తర్వాత తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో సుమారు 1200 మంది యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని పేర్కొన్నారు. వారి చావులకు కారణం సోనియాగాంధీ అని ఆరోపించారు. ఎన్నికల్లో కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక అక్కడి ప్రభుత్వం నడిపే పరిస్థితి లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం సాధ్యం కాదన్నారు. ఆ పథకాలను ప్రజలు నమ్మడం లేదన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు వరంలా ఉందన్నారు. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్‌ను గెలిపిస్తే కరీంనగర్‌ను పర్యాటక కేంద్రంగా అద్భుతంగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చిందన్నారు. అలాగే, దళితబంధు పథకంతో దళిత కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆరె రవి గౌడ్, షౌకత్, సత్తినేని శ్రీనివాస్, హరీశ్, నవాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన అభిమానం

- బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు
- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపునకు కృషి చేస్తామని వెల్లడి

రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన బత్తిని శ్రీనివాస్‌గౌడ్-లలిత దంపతుల కూతురు అశ్వినిని ఇటీవల చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన పులి వేణుగౌడ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా, ఇద్దరు చెన్నైలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ శుక్రవారం వన్నారం గ్రామానికి వెళ్లగా అశ్విని మంగళహారతి పట్టి ఘన స్వాగతం పలికారు. తాను తన భర్త ఇద్దరం బీఆర్ఎస్‌పై ఉన్న అభిమానంతో స్వగ్రామాలకు వచ్చామని, పార్టీ గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేస్తామని స్పష్టం చేశారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన సుంకె రవిశంకర్ సాఫ్ట్‌వేర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

-రామడుగు, అక్టోబర్ 20



సుంకె రవిశంకర్‌కు మంగళ హారతి పట్టి స్వాగతం పలుకుతున్న అశ్విని

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్

- అధ్యాపకులు, సిబ్బంది సంబురాలు



కళాశాల ప్రాంగణంలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 20: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ కేటాయిస్తు గురువారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడగా, శుక్రవారం ఉదయం కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది సంబురాలు చేసుకున్నారు. అయితే, ఈ నెల 9, 10వ తేదీల్లో 'న్యాక్' పీర్ టీమ్ 8 ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించింది. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి ఐదు సంవత్సరాల కాలానికి ఈ గుర్తింపు ఉండనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ క్రమంలో కళాశాల ప్రాంగణంలో పటాకులు కాల్చి, కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ, కళాశాలకు 'ఏ' గ్రేడ్ రావడానికి సహకరించిన కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి, మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్ కుమార్, మేయర్ సునీల్ రావు, సీసీఈ కమిషనర్, తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు. కాగా, కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చిన క్రమంలో మేయర్ వై సునీల్ రావు, సీసీఈ మాజీ కమిషనర్ నవీన్ మిట్టల్, ప్రస్తుత కమిషనర్ వాకాటి కరుణ, జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరి, డీటీ చారి, బాల భాస్కర్ తదితరులు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డీఎస్ చక్రవర్తి, ఫిజికల్ డైరెక్టర్ గండ్ర శ్రీధర్ రావు, సూపరింటెండెంట్ జీ శ్రీరామ్ రెడ్డి, బోధన సిబ్బంది శ్రీనివాస్, ఎం సత్యనారాయణ రెడ్డి, ఏ చంద్రశేఖర్, డాక్టర్ ఎంవీ లక్ష్మణరావు, కే సతీశ్‌కుమార్, డాక్టర్ డీ శ్రీనివాస్, వీ రాధా కిషన్, డాక్టర్ బీ రజినీ దేవి, డీ సుజాత, ఆర్ జ్యోతిర్మయి, ఏ శాలిని, కే సునీత, ఎం సంగీత రాణి, డాక్టర్ ఎం కల్పన, జే స్వప్న, నాజియా రెహమాన్, జబీన్ సుల్తానా, అర్షియా సుల్తానా, అత్యా సుల్తానా, పీ శ్రీనివాస్, బాలసుబ్రమణ్యం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# బొట్టు పెట్టి.. ఓటు అభ్యర్థించి

- కొత్తపల్లిలో మంత్రి గంగుల కమలాకర్ సతీమణి, కుటుంబసభ్యుల ప్రచారం



కొత్తపల్లి: మహిళకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థిస్తున్న గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు



బొమ్మకల్‌లో ఓటు అభ్యర్థిస్తున్న గంగుల కమలాకర్ సతీమణి రజిత

కొత్తపల్లి, అక్టోబర్ 20: కొత్తపల్లి పట్టణంలోని 1, 5, 6, 12వ వార్డుల్లో బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత, కుటుంబసభ్యులు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంగుల కమలాకర్ కుటుంబసభ్యులు గంగుల సుధాకర్, గీత, శారద, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 20: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత పేర్కొన్నారు. బొమ్మకల్ గ్రామంలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు



బీజేపీ కార్యకర్తకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, అక్టోబర్ 20: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు, యువకులు శుక్రవారం తిమ్మాపూర్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ప్రభుత్వ న్యాయవాదుల నియామకం



కేవీ వేణుగోపాల్‌రావు



లెంకల రాంరెడ్డి

కోర్టుచౌరస్తా, అక్టోబర్ 20: జిల్లా ప్రధాన న్యాయస్థానం కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది (జీపీ)గా కేవీ వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా లెంకల రాంరెడ్డి నియమితులయ్యారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముచ్చంపేట గ్రామానికి చెందిన వేణుగోపాల్ రావు జిల్లా కోర్టులో 29 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. తిమ్మాపూర్ మండలం వచ్చునూర్ గ్రామానికి చెందిన లెంకల రాంరెడ్డి జిల్లా కోర్టులో 28 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. వీరు ప్రభుత్వ న్యాయవాదులుగా మూడేళ్ల పదవీ కాలంలో కొనసాగుతారు.

**రిజిస్ట్రేషన్ దస్తావేజు పోయినది**

సమస్త ప్రజలకు తెలియజేయు విషయం నాక్లయింట్ ఎనకొండ బుచ్చిరెడ్డి తండ్రి:మచ్చిరెడ్డి R/o. హనుమాన్‌నగర్, కరీంనగర్ గారు మరియు ముగ్గురు మిత్రులు కలిసి రంగారెడ్డి జిల్లాలోని మల్కాజ్‌గిరి మండలంలోని అల్వాల్ లో సర్వేనెం. 570 లో 266.66 గజాల స్థలం రిజిస్ట్రేషన్ దస్తావేజు నెం. 562/2015 ద్వారా కొనుగోలు చేశారు. అట్టి ఒరిజినల్ దస్తావేజు నాక్లయింటు తేది.12-10-2023 రోజున శాతవాహన యూనివర్సిటి నుండి హనుమాన్ నగర్‌లోని తన ఇంటికి వెళ్ళె క్రమంలో ఎక్కడో జారిపోయినది. ఎంత ప్రయత్నం చేసిన నాక్లయింట్‌కు అట్టి రిజిస్ట్రేషన్ దస్తావేజు ఇంత వరకు లభించలేదు. ఇట్టి విషయమై నాక్లయింట్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ధరఖాస్తు ఇచ్చియున్నారు. కావున ఒరిజినల్ దస్తావేజు నెం. 562/2015 ఎవరికైన దొరికినచో క్రింది చిరునామాలో నేటి నుండి 7 రోజులలోపు ఇవ్వగలరు. లేనిచో ఒరిజినల్ దస్తావేజు నెం. 562/2015 నాక్లయింట్ పోయినదిగా భావించి రిజిస్ట్రేషన్ ఆఫీసు నుండి డూప్లికేట్ దస్తావేజు తీసుకోగలరు.

తేది: 20/10/2023

ఇట్లు :
Sd/-**ఎర్రం రాజారెడ్డి**, అడ్వకేట్,
# 10-3-322/2, మహాశక్తిపుర, విద్యానగర్
కరీంనగర్ సెల్: 9849259071

